www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 5 ఏప్రిల్ 2023
5
ఏలూరు

కారుణ్య నియామకంలో మహిళకు ఉద్యోగం

ప్రజాశక్తి - ఏలూరు

పెదవేగి మండలంలోని ప్రభుత్వ ఉద్యోగి అయినవల్లి శ్రీనివాస్ గత ఏప్రిల్‌లో గుండెపోటుతో మరణించడంతో ఆయన భార్య అయినవిల్లి నాగ ఇందిరకు మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో కారుణ్య నియామకంలో జూనియర్ అసిస్టెంట్‌గా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ద్వారా రాష్ట్రగ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు ఆధ్వర్యంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జోషి, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్‌సి. రామచంద్రమూర్తి, ప్రధాన కార్యదర్శి సిరిగినీడి సుబ్బారావు, అసోసియేట్ అధ్యక్షులు ఎస్‌కె.అక్బర్, కోశాధికారి డి.రవికుమార్, జిల్లా నాయకులు, కెడికె.ప్రసాద్, జాన్సీ రాణి, డి.వీరభద్రరావు, ఏలూరు డివిజన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి ప్రభాకర్, సింహాచలం పాల్గొన్నారు.

డిసిసిబి.. దొంగాట..!

సహకార సంఘాలకు షేర్ క్యాపిటల్‌పై వడ్డీ చెల్లింపు నిల్
ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకోని వైనం
సంఘాల షేర్ క్యాపిటల్ ధనం దాదాపు రూ.1275 కోట్లు
ఇవ్వాల్సిన వడ్డీ బకాయి సుమారు రూ.70 కోట్లు
బకాయిలు ఇవ్వకుండా వడ్డీరాయితీ వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి
జిల్లా సహకార కార్యాలయ అధికారులకు కనీస సమాచారం కరువు
నిరంకుశంగా వ్యవహరిస్తున్న డిసిసిబి అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సహకార సంఘాలతో డిసిసిబి (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) దొంగాట ఆడుతోంది. సహకార సంఘాలకు షేర్‌ధనంపై ఇవ్వాల్సిన డివిడెంట్ లేక వడ్డీ సొమ్మును 2010 నుంచి ఇప్పటి వరకూ చెల్లించకుండా 2013 మధ్యకాలంలో ఇచ్చిన వడ్డీరాయితీ సొమ్ము వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా సహకార కార్యాలయానికి కనీసం సమాచారం ఇవ్వని పరిస్థితి నెలకొంది. నిరంకుశ ధోరణిలో ముందుకు సాగుతున్న డిసిసిబి తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

జిల్లాలో 258 సహకార సంఘాలున్నాయి. ఈ సహకార సంఘాల్లో అప్పులు తీసుకుని రైతుల నుంచి పది శాతం షేర్ క్యాపిటల్‌గా వసూలు చేస్తారు. ఈ సొమ్మును జిల్లా సహకార కేంద్రబ్యాంకు(డిసిసిబి)కు సహకార సంఘాలు చెల్లిస్తాయి. నిబంధనల ప్రకారం షేర్‌క్యాపిటల్ సొమ్ముపై డివిడెంట్ గానీ, లేదా ఆరుశాతం వడ్డీగానీ చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ ఏడాదిలో చెల్లించకపోతే ఆడిట్‌లో అందుకు సంబంధించిన వివరాలను పొందుపరచాలని సైతం అదేశాలున్నాయి. 2010 నుంచి ఇప్పటి వరకూ జిల్లాలోని సహకార సంఘాలకు డిసిసిబి డివిడెంట్ రూపంలోగానీ, వడ్డీరూపంలోగానీ ఒక్కరూపాయి చెల్లించలేదు. 2010-11 నుంచి 2021-22 వరకూ షేర్‌క్యాపిటల్ కింద సహకార సంఘాల నుంచి డిసిసిబికి వెళ్లిన సొమ్ము దాదాపు రూ.1275 కోట్ల వరకూ ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ సొమ్ముకు ఇప్పటి వరకూ లెక్కిస్తే రూ.76 కోట్ల వరకూ వడ్డీరూపంలో సహకార సంఘాలకు రావాల్సి ఉందని తెలుస్తోంది. 2010 నుంచి 2022 కాలంలో మొత్తం వడ్డీ రూపంలో సహకార సంఘాలకు రూ.76 కోట్లు రావాల్సి ఉండగా డిసిసిబి నుంచి కేవలం రూ.ఆరు కోట్ల వరకు మాత్రమే ఇచ్చినట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన ఆరుశాతం వడ్డీలో డిసిసిబి ఇచ్చిన సొమ్ము ఒక్కశాతం కంటే తక్కువగానే ఉంది. ఏదో కంటితుడుపుచర్యగా మాత్రమే ఇచ్చినట్లు అర్థమవుతోంది. షేర్ క్యాపిటల్‌పై డివిడెంట్‌గానీ, వడ్డీగానీ రాకపోవడంతో ఆర్థికంగా సహకార సంఘాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సహకార సంఘాలకు ఇవ్వాల్సిన షేర్‌క్యాపిటల్‌పై ఇవ్వాల్సిన వడ్డీ చెల్లించకుండా 2010-13 మధ్యకాలంలో సహకార సంఘాల్లోని రైతులకు చెల్లించిన వడ్డీరాయితీ సొమ్ము ఆరు శాతాన్ని తిరిగి ఇవ్వాలని డిసిసిబి ఉత్తర్వులు ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. డిసిసిబి తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఈ విధంగా వ్యవహరిస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వడ్డీరాయితీ మినహాయించుకున్న ఇంకా రూ.40కోట్లుబకాయి

2010-13 మధ్య జిల్లాలోని సహకార సంఘాల్లో అప్పులు తీసుకున్న రైతులకు డిసిసిబి ఇచ్చిన ఆరుశాతం వడ్డీ రాయితీ సొమ్ము రూ.27.51 కోట్లు మాత్రమే. కానీ సహకార సంఘాలకు షేర్‌క్యాపిటల్‌పై ఇవ్వాల్సిన వడ్డీ ఇంకా రూ.70 కోట్ల వరకూ ఉంది. ప్రభుత్వం వడ్డీ రాయితీ సొమ్ము ఇవ్వలేదన్న నెపంతో తిరిగి ఇవ్వాలని సహకార సంఘాలపై డిసిసిబి ఒత్తిడి తెస్తోంది. షేర్‌క్యాపిటల్‌పై సహకార సంఘాలకు రావాల్సిన వడ్డీ బకాయిల్లో సంఘాలకు ఇచ్చిన వడ్డీరాయితీ సొమ్ము రూ.27.51 కోట్లు మినహాయించుకున్నా ఇంకా సహకార సంఘాలకు దాదాపు రూ.40 కోట్లు డిసిసిబి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కలేమీ చెప్పకుండా వడ్డీరాయితీ సొమ్ము చెల్లించాలంటూ సహకార సంఘాలతో డిసిసిబి దొంగాట ఆడటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సహకార సంఘాల పర్యవేక్షణకు జిల్లా సహకార కార్యాలయం ఉంది. ఇక్కడ అధికారులకు కూడా డిసిసిబి కనీస సమాచారం ఇవ్వకుండా ముందుకు సాగుతోంది. నాబార్డు, ఆప్కాబ్ సంస్థలకు సమాచారం ఇచ్చారో లేదో కూడా తెలియని పరిస్థితి. వడ్డీరాయితీ సొమ్మును సహకార సంఘాలు చెల్లిస్తే భవిష్యత్‌లో అన్నిరకాలుగా ఆడిట్‌లో ఇబ్బందులు తప్పవన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల కాలంలో డిసిసిబి అధికారులు నిరంకుశ ధోరణి మరింత పెరిగిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు నచ్చినవిధంగా ముందుకు సాగుతున్నారన్న చర్చ నడుస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు డిసిసిబిలో జరుగుతున్న పరిణామాలపై దృష్టిసారించాలని అంతా కోరుతున్నారు.


9

CIRCULAR MEMORANDUM OF THE COMMISSIONER FOR COOPERATION AND REGISTRAR OF COOPERATIVE SOCIETIES, ANDHRA PRADESH, GUNTUR

Rc.No.13034/17/2022/PACS-I. Dt 01/06/2022

Sub: Cooperation Department - Cooperative Credit Societies (CCS) - Payment of Dividend/ minimum interest on the Share Capital by DCCBs - Statutory obligation to pay minimum dividend/ interest on paid up share capital as per Rule 36(5)(d) of the APCS Rules 1964 - Instructions - Issued.

&&&&&

During the course of discussions with the representatives of PACS Employees Unions, in the O/o the Secretary to Govt (Cooperation & Marketing), the representatives of the Unions raised that DCCBs are not paying dividend on the share capital even though they are getting profits. The Managing Director, APCOB reported that APCOB is paying dividend to the DCCBs @6% on the paid up capital.

2. As you are aware that Rule 36(5) (d) of the APCS Rules, 1964 specifies that *"every society shall pay a dividend or interest which is not less than 6% per annum on paid share Capital every year. If, for any reasons this interest or dividend is not paid, it shall be pointed out in audit, inspection or inquiry, and a provision shall be made to carry forward the amount for the subsequent year."* Thus, it means every society has to pay either dividend or interest not less than @6% on paid up Share Capital and it is a statutory obligation on the part of the society.

3. The Government exempted the Credit Cooperatives i.e. PACSs, DCCBs and APCOB from the operation of Rule 36(5)(d) of the APCS Rules, 1964 for the years from 2004-2005 to 2010-2011 as most of the DCCBs in the State are in accumulated losses and their financial health is not improved and further the exemption to operate the provision under Rule 36(5)(d) is not extended beyond 2011-2012.

4. It is reported that in the recent past, most of the DCCBs have been earning profits, thereby wiped out their accumulated losses and recording net profits. Even though the DCCBs are in profits, they are not paying the dividend or interest to the PACSs on their Share Capital as prescribed at Rule 36(5) (d) of APCS Rules 1964 by putting PACS at loss to such extent.

5. Therefore, the DCCBs shall adhere to the following instructions for implementation of the Rule.36(5)d) of the APCS Rules, 1964.

i. All the DCCBs shall take action for declaring dividend not less than @6% on paid up share capital each year in case the DCCB earned a profit to pay the dividend.
ii. In case any DCCB, is not able to declare dividend @ of atleast 6% on paid up share capital for some reason or the other, it should be ensured that the DCCB shall pay minimum interest of not less than 6% on the paid up share capital subscribed by the members.
iii. In case any DCCB for some reason or the other is not able to comply with the above two requirements, it shall be ensured that minimum interest on the share capital at the rate of 6% is calculated by showing interest as expenditure and amount payable under Sundry Creditors.

2022లో షేర్‌క్యాపిటల్‌పై ఆరుశాతం వడ్డీ సహకార సంఘాలకు ఇవ్వాలంటూ పై జారీచేసిన ఉత్తర్వుల కాపీ

సమస్యను ప్రభుత్వానికి వివరిస్తా

టి.ప్రవీణ, జిల్లా సహకార కార్యాలయ అధికారి

వడ్డీ రాయితీ సొమ్ము వెనక్కి ఇవ్వాలన్న డిసిసిబి నిర్ణయంపై జిల్లా సహకార కార్యాలయ అధికారిని 'ప్రజాశక్తి' వివరణకోరగా డిసిసిబి నుంచి తమ కార్యాలయానికి ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. దీనిపై స్పందనలోనూ ఫిర్యాదు వచ్చిందని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అదేవిధంగా షేర్‌క్యాపిటల్ వడ్డీపైనా డిసిసిబిని అడుగుతామన్నారు.

గ్రేడ్ -4 పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఏలూరు

ఉద్యోగోన్నతి పొందిన కార్యదర్శులు

ఉద్యోగోన్నతి పొందిన వారు అంకిత భావంతో పనిచేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా పంచాయతీ విభాగంలో పనిచేస్తున్న 22 మంది గ్రేడ్-4 పంచాయితీ కార్యదర్శులకు గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత ఉద్యోగోన్నతి ఉత్తర్వుపత్రాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతమందికి ఒకేసారి ఉద్యోగోన్నతి లభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకోసం చేసే పని దైవంతో సమానమన్నారు. ఉద్యోగులందరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. ఉద్యోగులు వెంటనే తమకు నిర్ధేశించిన స్థానాల్లో ఎంపిడిఒలకు రిపోర్ట్ చేయాలన్నారు. 19 మంది ప్రస్తుతం వారు పనిచేస్తున్న ప్రదేశంలోనే విధులు నిర్వర్తించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-4 పరీక్షలు

601 మంది అభ్యర్థులు హాజరు - డిఆర్‌ఒ మూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న డిఆర్‌ఒ మూర్తి

ప్రశాంత వాతావరణంలో ఏలూరు జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 సర్వీసెస్ పరీక్షలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి తెలిపారు. ఇందులో భాగంగా గ్రూప్-4 సర్వీసెస్‌కు 710 మంది అభ్యర్థులకు గాను 601 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని, 109 మంది అభ్యర్థులు హాజరు కాలేదని తెలిపారు. వీటిలో సిద్ధార్థ స్కూల్లో 360 మంది అభ్యర్థులకుగాను 303 మంది హాజరయ్యారన్నారు. 57 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలలో 190 మంది అభ్యర్థులకు 164 మంది హాజరు కాగా 26 మంది హాజరు కాలేదని వివరించారు. సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 160 మంది అభ్యర్థులకు 134 మంది హాజరు కాగా 26 మంది హాజరు కాలేదని తెలిపారు. పిడబ్ల్యూడి అభ్యర్థులు ఇద్దరికి గాను ఇద్దరు హాజరైనట్లు తెలిపారు.

పేదింట వెలుగు నింపిన వైఎస్ఆర్ ఆసరా

అర్బన్ పరిధిలోని 3,588 స్వయం సహాయక సంఘాలకు రూ.27.60 కోట్లు
ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు



చెక్కు అందిస్తున్న ఎంఎల్‌ఎ ఆళ్ల నాని

మహిళల సర్వతో ముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను మహిళలకు అందిస్తుందని ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్(నాని) అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రామకోటి ప్రాంగణంలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు అర్బన్ పరిధిలోని 3,588 స్వయం సహాయక సంఘాల్లోని 35 వేల మంది మహిళలకు రూ.27.60 కోట్ల చెక్కును అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ ఆళ్ల నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతిగా విశ్వసనీయతతో అన్ని సంక్షేమ పథకాలను మహిళలకు అందిస్తున్నారన్నారు. అక్కా చెల్లెమ్మలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ వరుసగా మూడో విడత రుణ మాఫీని వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా అందిస్తున్నారన్నారు. డ్వాక్రా రుణాలను రుణమాఫీ చేస్తామని చెప్పి చేయకుండా గత ప్రభుత్వం మహిళలను ఇబ్బందికి గురి చేసిందన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చేనాటికి 7.98 లక్షల మహిళా సంఘాల్లోని 78.94 లక్షల అక్కా చెల్లెమ్మలకున్న అప్పు నిల్వ రూ.25,571 కోట్లను వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో చెల్లిస్తానని చెప్పి ఇప్పటికే రెండు విడతల్లో రూ.12,758 కోట్లను మహిళా పొదుపు సంఘాల ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. మూడో విడతగా ప్రస్తుతం మరో రూ.6,439.52 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. దీంతో మొత్తంగా మూడు విడతల్లో రూ.19,178 కోట్లు 78.94 లక్షల అక్కా చెల్లెమ్మలకు లబ్ధి చేకూర్చారన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ సిఎం జగన్ ఆశీస్సులతో ఏలూరు ఎంఎల్‌ఎ సహకారంతో ఏలూరు నగరపాలక సంస్థను అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. ఈ అభివృద్ధిలో మహిళలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఏలూరు నగరంలో వైఎస్ఆర్ ఆసరా కింద మొదటి విడతలో రూ.18.61 కోట్లు, రెండో విడతలో రూ.18.91 కోట్లు, మూడో విడతలో రూ.27.60 కోట్లు అందించినట్లు తెలిపారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్ పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి బలరామ్ మాట్లాడుతూ మహిళలు అన్ని విషయాల్లో ముందుండాలని, మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అన్ని కార్యక్రమాలను చేపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ పైడి భీమేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ నెరుసు చిరంజీవి, మధ్యాహ్నపు బలరామ్, పలువురు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, మెప్మా పీడీ బి.ఇమ్మానియేల్, మెప్మా జిల్లా డిఎంసి కె.మహాలక్ష్మి, ఏలూరు టిఎంసి పి.నాగమణి పాల్గొన్నారు.

ఏలూరు నగరంలో 25 వేల మందికి ఇళ్ల స్థలాలు

నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఏలూరు నగరంలో పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో 25 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక పోణంగిలోని పేదలందరికీ ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం సాయంత్రం అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ నవరత్నాల కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పేదలందరికీ ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోణంగి జగనన్న లే అవుట్‌లలో 5688 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్లు చెప్పారు. వీరందరూ ఇళ్లు నిర్మించుకునేందుకు నిర్మాణ కాంట్రాక్టర్ల సహకారం అందిస్తున్నారన్నారు. పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులతో డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులకు అదనంగా రూ.35 వేలు రుణంగా అందిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకుని తమ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసుకునేలా అధికారులు లబ్ధిదారులను ప్రోత్సహించాలని చెప్పారు. మండల స్థాయి అధికారులు సమన్వయంతో పేదలందరికీ ఇళ్ల నిర్మాణ పనులు మరింత వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్‌తో పాటు గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, తహశీల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రవాణా, అమ్మకాలపై నిఘా

జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎస్పి రాహుల్‌దేవ్‌శర్మ

మాదక ద్రవ్యాల రవాణా, అమ్మకాలపై నిఘా పెంచుతూ ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పి రాహుల్‌దేవ్‌శర్మతో కలిసి జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గంజాయి ఉత్పత్తి, రవాణా వినియోగంపై కమిటీ సమావేశ అధికారులు పటిష్ట నిఘా పెట్టి జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. ఈ క్రమంలో గ్రామాలపై ప్రత్యేకమైన దృష్టి సారించాలన్నారు. ఆర్‌టిసి బస్సుల్లోనూ, కొరియర్ సేవల ద్వారా జరుగుతున్నట్లు ఆరోపణలు నేపథ్యంలో కొరియర్ సేవల యాజమాన్యానికి అవగాహన కల్పించాలని, అలాగే సామాన్ల మెటీరియల్ స్కానింగ్ చేసే మిషన్లను ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి అధికారులకు కలెక్టర్ సూచించారు. గంజాయిని ఉపయోగించే బ్లాక్‌స్పాట్లను గుర్తించి, ప్రత్యేక నిఘ పెట్టాలని, మాదకద్రవ్యాల వాడటం వల్ల వచ్చే అనర్థాలను తెలియజేసే వాల్‌పోస్టర్లను ఆ స్పాట్‌లో ఏర్పాటు చేయాలని తెలిపారు. మాదకద్రవ్యాలపై ప్రతి పాఠశాలలోనూ, కాలేజీలోనూ, ఎలిమెంటరీ స్కూళ్లలో కూడా వైద్యశాఖ, విద్యాశాఖ, కమిటీ సమన్వయ అధికారులతో అవగాహన కల్పించాలని, అదే విధంగా పోస్టర్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ మాదకద్రవ్యాలను అరికట్టడంలో ఎన్‌జిఒలు, స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. గంజాయి మత్తు పదార్థాలకు అడ్డుకట్ట వేయడంలో జిల్లా పోలీసు యంత్రాంగం బాగా పనిచేస్తుందని కలెక్టర్ అభినందించారు. జిల్లా ఎస్‌పి రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో గంజాయి, అక్రమ రవాణాను అరికట్టడానికి పకడ్బందీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి కేంద్రంగా విశాఖపట్నం నుంచి రవాణా జరుగుతుందని, ఏలూరు జిల్లాలో రహదారుల మార్గం ద్వారా గంజాయి స్మగ్లింగ్ జరుగుతుందని చెప్పారు. ఎన్‌హెచ్ 16 రహదారి ద్వారా నల్లజర్ల హనుమాన్ జంక్షన్ విజయవాడ వయా గుండుగొలను మీదుగా అలాగే సిద్ధాంతం, హనుమాన్ జంక్షన్ వయా విజయవాడ మీదుగా గుండుగొలను ఎన్‌హెచ్ 516 దేవరపల్లి, జీలుగుమిల్లి, అశ్వరావుపేట మీదుగా గంజాయి రవాణా జరుగుతున్నట్లు గుర్తించామని, దీని నిమిత్తం చెక్ పోస్టుల దగ్గర పకడ్బందీగా 24 గంటలు నిఘా ఏర్పాట్లు చేశామని తెలిపారు. 2021-2022-2023 మార్చి వరకు 69 గంజాయి కేసులు రిజిస్టర్ చేశామని, 70 వాహనాలను సీజ్ చేశామని, 248 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. 17260.799 కేజీల గంజాయిని ధ్వంసం చేశామని తెలిపారు. డిఎస్‌పిలు ఇతర అధికారులతో విద్యాసంస్థల్లో అవగాహన మాదక ద్రవ్యాల వల్ల నష్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వీటిలో 2023 సంవత్సరానికి 101 కాలేజీల్లోను, 20 స్కూల్స్‌లోను, 50 పబ్లిక్ స్థలాల్లోను, 50 గ్రామాల్లోను అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 18 స్కూళ్లను, 41 కాలేజీల్లోను, పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 74 మెయిన్ జంక్షన్లలో మాదక ద్రవ్యాలపై హోర్డింగ్స్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. ప్రతి మాసంలో నిర్వహించే కమిటీ సమావేశానికి సమన్వయ కమిటీ ప్రణాళికను రూపొందించి అమలు చేయడానికి అవసరమైన సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అదనపు ఎస్పి సూర్యచంద్ర, డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఆశ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, డిఎస్‌పిలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, వ్యవసాయ శాఖ జెడి రామకృష్ణ, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, ఆర్‌టిసి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

నారాయణపురం కాలేజీకి రూ.20 లక్షలు విరాళం

ప్రజాశక్తి - ఉంగుటూరు

కళాశాల యాజమాన్యానికి చెక్కు అందిస్తున్న ఆదిరెడ్డి

మండలంలోని నారా యణపురానికి చెందిన విద్యా దాత అప్పసాని శేషగిరిరావు తన వందో పుట్టినరోజు వేడుకలను ఈ నెల రెండో తేదీన ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని శేషగిరిరావు తనయుడు రవికుమార్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ పేరిట చెక్కును ఇచ్చారు. ఈ క్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావుకు ఒలంపిక్ అసోసియేసన్ కార్యదర్శి, ఇదే కళాశాల విశ్రాంత పీడీ ఆదిరెడ్డి సత్యనారాయణ మంగళవారం చెక్కును అందించారు. త్వరలో పనులు ప్రారంభించి రెండు నెలల లోపే అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. కళాశాల అభివృద్ధికి దాతలను ప్రేరేపించి నిధులు తీసుకువచ్చిన ఆదిరెడ్డిని, విరాళం ఇచ్చిన శేషగిరిరావు కుటుంబ సభ్యులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ప్రయివేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

11 మందికి గాయాలు

ప్రజాశక్తి - దెందులూరు

బోల్తా పడిన బస్సు ఇదే..

మండలంలోని కొవ్వలి వంతెన సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ప్రయివేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడిన ఘటనలో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. దెందులూరు ఎస్ఐ ఇజ్జాపు వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి విజయనగరం వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్‌కు చెందిన నాన్ ఎసి బస్సు కొవ్వలి వంతెన సమీపంలోని పాత పెట్రోల్ బంకు వద్ద తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో బోల్తాపడింది. ప్రమాదం సంభవించినప్పుడు బసుసలో సుమారు 40 మంది ప్రయాణికులున్నారు. ఈ ప్రమాదంలో 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న దెందులూరు ఎస్ఐ ఇజ్జాపు వీర్రాజు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో బస్సును పైకి లేపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనాల్లో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనావేశారు. దెందులూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నసమారాధనతో ఆత్మసంతృప్తి : ఎస్‌పి

ఏలూరు: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న పోలీస్ క్వార్టర్ సమీపంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన 88వ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, అన్ని దానాల్లో అన్నదానానికి అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఎదుటి మనిషికి ధన రూపంలో ఎంత సహాయం చేసినా సంతృప్తి ఉండదని, అదే ఒక మనిషికి భోజన సదుపాయాన్ని కలగచేస్తే కలిగే ఆత్మసంతృప్తి వేరని ఎస్‌పి అన్నారు. ఈ అన్న సమారాధన కార్యక్రమంలో ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి జివిఎస్.పైడేశ్వరరావు, ఎఆర్ ఆర్ ఐ పవన్‌కుమార్, ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ఆర్ ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక వట్లూరులోని సర్‌సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది విద్యార్థులు రక్తదానం చేసినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ సర్ సి ఆర్ ఆర్ విద్యాసంస్థల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించడానికి సహకరిస్తున్న ఆ సంస్థల యాజమాన్యానికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ పిఒ వి.ప్రణవ్, రూరల్ లయన్స్ క్లబ్ సభ్యులు, విఆర్ఒ కెవి.రమణ పాల్గొన్నారు.

ఇంటి రుణం రూ.5 లక్షలు ఇవ్వాలి

సిపిఐ నాయకుల వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.ఐదు లక్షలు కేటాయించాలని సిపిఐ మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శి కంచర్ల గురవయ్య, తోర్లపాటి బాబు కోరారు. ఈ మేరకు బోయగూడెం సచివాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోవడంలేదన్నారు. ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు పెరగడం వల్ల లబ్ధిదారులు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకునే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క ఇంటికి రూ.ఐదు లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.జాని, మండల కమిటీ సభ్యులు దొంత కృష్ణ, తాడిగడప మాణిక్యాలరావు పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో వైసిపిదే విజయం'

ప్రజాశక్తి - చింతలపూడి

2024లో మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తుందని చింతలపూడి మండల సచివాలయ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రాఘవపురం, గణిచర్ల, మల్లయ్యగూడెం గ్రామ సచివాలయం వద్ద మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వజ్రకిషోర్, చంద్రు కిషోర్, వైసిపి నాయకులు, గృహసారధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

భోజనం చేస్తున్న యాత్రికులు

మద్ది ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఒక్కరోజు 1200 మంది యాత్రికులకు అన్నదానం నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. మంగళవారం ఆలయానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావడం వల్ల వారికి అసౌకర్యం కలుగకుండా ఆలయ సిబ్బంది తాగునీరు, తగిన వసతులను కల్పించి సేవలందించారని తెలిపారు. ఒక్కరోజు ఆదాయం రూ.1,05,661 సమకూరిందని తెలిపారు. ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు సరిత విజయబాస్కరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చడానికి వ్యాపారులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ కోరారు. ఈ మేరక ఆయన మంగళవారం పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ఏప్రిల్ ఆరో తేదీ ఉదయం పది గంటలకు ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన ప్లాస్టిక్ రహిత జంగారెడ్డిగూడెం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ వ్యాపారులు, ప్రజలు, ప్రముఖులు ప్లాస్టిక్ రహిత పట్టణం ఏర్పాటుకు తగిన సలహాలు, సూచనలు, సహకారం అందించాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

రెండు గ్రూపుల మధ్య ఘర్షణ

పలువురికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయాలపాలైన సంఘటన అశ్వారావుపేట రోడ్డులో కాకర్ల జంక్షన్ వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనపై పోలీసులు ఇరుగ్రూపులపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పులకంధం మోహనరావుకు చెందిన ఇంటిని ఊరకరణం జగన్నాధరావుకు అద్దెకు ఇచ్చారు. ఈ క్రమంలో అద్దె వ్యవహారంలో పులకందం మోహనరావు తన సోదరుడు పులకంధం శ్రీనివాసరావులు స్థానిక అశ్వారావుపేటరోడ్డు కాకర్ల జంక్షన్ వద్ద ఊరకరణం జగన్నాధరావు, కొప్పుల సత్యనారాయణలతో ఘర్షన పడ్డారు. ఈ క్రమంలో ఇరుగ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో ఇరువైపులా వారికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి వెళ్లి ఇరు గ్రూపులను చెదరకొట్టారు. రెండు గ్రూపుల వారిలో గాయాలపాలైనవారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని సమాచారం. రెండు వైపులవారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు.

హోటల్లో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నగరంలోని ఆర్ ఆర్ పేట ప్రాంతంలో ఓ ప్రముఖ హోటల్లో పోలీసుల మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పలువురు పేకాట ఆడుతూ పట్టుపడ్డారు. మరికొందరు మద్యం మత్తులో వ్యభిచారం చేస్తూ పట్టుపడినట్లు సమాచారం. వారందరిని ఏలూరు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - భీమడోలు

పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ రాఘవన్ కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన మండల విద్యాధికారి డి.సాంబశివరావుతో కలిసి నాడు-నేడు పనుల ప్రగతిపై పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ నిర్మాణాల కోసం కేటాయించిన రివాల్వింగ్ ఫండ్ నిధులను ఈ నెలాఖరులోగా నూరుశాతం ఖర్చు చేయాలని కోరారు. పాఠశాలలో నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాలను ప్రమాదజోన్లుగా ప్రకటించి విద్యార్థులు ఆ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఇదే సమయంలో విద్యార్థులకు బోధన ఇబ్బందులు తలెత్తకుండా నాడు-నేడు పనులు చేపట్టిన బాధ్యులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌లకు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. పాఠశాలల్లో పారిశుధ్య పరిరక్షణ పనులు చేపట్టే బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పగిస్తామన్నారు.

నాడు-నేడు పనుల ప్రగతిపై సమీక్షిస్తున్న ఎంపిడిఒ, ఎంఇఒ

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జీలుగుమిల్లిలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మహిళ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం నిర్వహించిన జీలుగుమిల్లిలో స్వయం సహాయక సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మహిళల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన నవరత్న హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నారన్నారు. దానిలో భాగంగానే ఈ వైఎస్ఆర్ ఆసరాను వరుసగా మూడు విడతల వారీగా మహిళలకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. మొత్తం జీలుగుమిల్లి మండలంలో ఉన్న స్వయం సహాయక సంఘాలకు 580 గ్రూపులకు 5802 మంది డ్వాక్రా మహిళలకు రూ.3.12 కోట్ల చెక్కును అందించారు. అనంతరం డ్వాక్రా మహిళలు సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం జీలుగుమిల్లిలో ప్రయాణికుల సౌకర్యార్థం ఎంఎల్ఎ నిధులు రూ.5 లక్షలతో నిర్మించనున్న బస్ షెల్టర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద చలివేంద్రం

ఎండాకాలం ప్రారంభం కావడం ఎండలు ఎక్కువగా ఉన్నందున తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే వారికి మంచి నీటి సౌకర్యం కోసం రెవెన్యూ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ జి.ఎలీషాతో కలిసి ప్రారంభించి పలువురికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, సర్పంచులు చిర్రి జగదాంబ, కుంజ పార్వతి, సున్నం ఉషారాణి, ఎంపిడిఒ మంగతాయారు, ఎపిఎం రామారావు, సొసైటీ అధ్యక్షులు బోధ శ్రీనివాస్, గూడవల్లి శ్రీనివాస్, గాంధీ, వైకాపా సీనియర్ నాయకులు సంధా ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, ప్రేమ్‌కుమార్, ఉప సర్పంచి రవితేజ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మాట్లాడుతున్న ఎంఎల్ఎ వెంకటప్రతాప్‌అప్పారావు

నూజివీడు రూరల్ : సిఎం జగన్ ప్రజల పక్షపాతని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వైఎస్ఆర్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సాధారణ మహిళలను ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ, వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, వైసిపి పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ శీలం రాము పాల్గొన్నారు.

భీమడోలు : చేసిన వాగ్దానాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. పూళ్ల హైస్కూల్ కేంద్రంగా మంగళవారం సాయంత్రం మండల పరిధిలోని పూళ్ల, కోడూరుపాడు, దుద్దేపూడి, కురెళ్లగూడెం గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాలకు మంజూరైన మూడో విడత ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ చేపట్టారు. ఈ సందర్భంగా 338 స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యులకు రూ.2.56 కోట్ల ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికార, అనధికార ప్రముఖులు పాల్గొన్నారు.



భీమడోలులో చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజలను మోసగించిన వైసిపి : బొరగం శ్రీనివాస్

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర ప్రజలను వైసిపి మోసం చేసిందని, పరిపాలించే అధికారం ఆ పార్టీకి లేదని టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని అల్లంచర్లరాజుపాలెంలో మంగళవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు. తొలుత స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. పరోక్షంగా ప్రత్యక్షంగా టిడిపి నాయకులపై దాడులు చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. ఓటు ద్వారా జగన్‌కు బుద్ధి చెప్పాలని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, నల్లూరి చలపతిరావు, సర్పంచి నార్ని వెంకట్రావు, మెతుకుమిల్లి గోపాలరావు, నాయుడు రామకృష్ణారావుగౌడ్, ఆచంట అనిల్, తోట లక్ష్మీనారాయణ, బొంతు సత్యనారాయణ, గంటా సతీష్, ఆచంట సూర్యనారాయణ, పెద్దిన సత్యనారాయణ, జోనుబోయిన సోంబాబు, కాల్నీడి రాంబాబు పాల్గొన్నారు.

అల్లంచర్లలో ఇదేం ఖర్మ కార్యక్రమంలో టిడిపి నాయకులు

రీ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం జగన్ భూ హక్కు-భూ రక్ష కార్యక్రమం ద్వారా భూ రీ సర్వే చేపట్టడం ఎంతో ఆనందాయకమని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో రీ సర్వేపై మండలంలోని 16 గ్రామాల విఆర్ఒలకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయం గ్రేడ్-5 కార్యదర్శులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజానాయన మాట్లాడుతూ గతంలో 1958లో సర్వే చేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం రీ సర్వే చేయలేదని చెప్పారు. దీంతో గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువైపోయాయన్నారు. డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ వరహారాజులు మాట్లాడుతూ ఇంటి స్థలాలు కూడా రీ సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల ఆరో తేదీ నుంచి 27వ తేదీ వరకు మండలంలో రీ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. జెడ్‌పిటిసి సభ్యులు వి.ప్రతాప్ మాట్లాడుతూ రీ సర్వే వల్ల అందరికీ భూ హక్కు పట్టాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు ఎం.నాగమల్లేశ్వరరావు, ఎంపిడిఒ బిఎ.సత్యనారాయణ, సర్వేయర్ సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన

శుభ్రం చేస్తున్న సిబ్బంది

శ్రీవారి ఆలయం శుభ్రం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మంగళవారం చీరాలకు చెందిన శ్రీ భ్రమరాంబికా సేవాసమితి సభ్యులు ఆలయ శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సేవా సమితి సభ్యులు ఏడు సంవత్సరాల నుంచి శ్రీ వారి ఆలయంలో హుండీ సేవ, జనరల్ సేవ చేస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షురాలు ఎంవిఎస్.మహాలక్ష్మి తెలిపారు. సుమారు 250 సభ్యుల బృందంతో చినవెంకన్న ఆలయంలో ఏప్రిల్ 4, 5 మంగళ, బుధవారం రెండు రోజులు గోశాల, ధార్మిటరి, క్యూలైన్లు, మండపాలు, అన్నదానం, సత్రాలు, కల్యాణకట్ట వద్ద ఆలయ శుభ్రత కార్యక్రమం నిర్వవిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారివారు వసతి, భోజన సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

అన్నవరం-దేవరం వంతెన నిర్మించరూ..!

గ్రామస్తుల అవస్థలు

డ్రెయిన్‌లో దిగి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

భయాందోళనలో తల్లిదండ్రులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అన్నవరం-దేవరం గ్రామాల మధ్య పంచాయతీ రాజ్ రహదారిలో అన్నవరం డ్రెయిన్‌పై ఉన్న వంతెన కుప్పకూలడంతో దేవరం గ్రామస్తులు పడరాని పాట్లు పడుతున్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరి గత నెల 29వ తేదీ కుప్పకూలింది. దీంతో దేవరం గ్రామానికి, అన్నవరం గ్రామానికి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యం దేవరం గ్రామస్తులు ఈ వంతెనపై నుంచి ముదినేపల్లి, ఇతర గ్రామాలకు పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక దేవరం నుంచి విద్యార్థులు నిత్యం ఈ వంతెనపై నుంచే ముదినేపల్లిలోని వివిధ విద్యాసంస్థలకు సైకిళ్లపై ప్రయాణిస్తుంటారు. దేవరం గ్రామం యావత్తు ఆక్వాసాగు విస్తరించడంతో ఆక్వారైతులు నిత్యం వంతెన పైనుంచే ఆక్వా ఉత్పత్తులు రవాణా చేస్తుంటారు. ఈ వంతెన ఆక్వా రైతులకు, దేవరం గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన వంతెన కుప్పకూలి వారం రోజులు గడచినా అటు అధికారులుగాని, ఇటు ప్రజాప్రతినిధులు కాని పట్టించుకోకపోవడంపై దేవరం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా ఓట్లయితే కావాలి గాని మా బాగోగులు పట్టించుకోరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన కూలడంతో దేవరం నుంచి ముదినేపల్లిలోని విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు అన్నవరం డ్రెయిన్ దాటుకుని ముదినేపల్లి చేరుకుంటున్నారు. నిత్యం ఈ రీతిగా డ్రెయిన్‌లో దిగి విద్యార్థులు పాఠశాలలకు వెళ్తూ నకరం అనుభవిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి దేవరం గ్రామస్తులు ఇబ్బందులు పడకుండా వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, అప్పటి వరకు డ్రెయిన్ దాటేందుకు ప్రత్యామ్నాయంగా కాలిబాట వంతెన ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

డ్రెయిన్ దాటుకుని స్కూళ్లకు వెళ్తున్న దేవరం విద్యార్థులు



స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు జీవన నైపుణ్య లక్షణాలు అలవర్చుకోవాలని ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు అన్నారు. పట్టణంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద పడాల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రధరరావు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, క్రీడానైపుణ్యం పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం కోసం, వారి స్థాయి సామర్థ్యాలు తెలుసుకోవడానికి కారక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

'వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం'

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని జనసేన నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య అన్నారు. ఈ నెల ఆరో తేదీన జనంలోకి జనసేన, జనసేనలోకి జనం కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం 27 రకాల ఎస్‌సి, ఎస్‌టి పథకాలు రద్దు చేసిందన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోవడంలేదని, రాష్ట్రంలో అభివృద్ధి వైసిపి ప్రభుత్వం మరిచిపోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు చిదారాల మధుబాబు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

నార్కిమిల్లి వెంకటలక్ష్మి, భర్త: దుర్గ ప్రసాద్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఇంటి నుండి ఆచంట వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు నెంబర్: **P1732700** గల **పాస్‌పోర్టు** ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియచేయగలరు.

నార్కిమిల్లి వెంకటలక్ష్మి,
భర్త: దుర్గా ప్రసాద్, డోర్ నెం: 9-53/1,
మాదాసువారి పాలెం, వల్లూరు,
ఆచంట మండలం, ప॥గో॥జిల్లా,
పిన్: 534269. సెల్ : 73308 32954

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో

E.P. 19/2023 in O.S. 134/2016

నాంద్ర లక్ష్మి -డిక్రీ హోల్డరు

మరియు

కంచుమర్తి లక్ష్మీ వెంకట నాగలత -జడ్జిమెంటు డెటారు

పై నెంబరులో డిక్రీ వసూలు నిమిత్తం యీక్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **ది. 24-4-2023న** పై **కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥** లగాయితూ బహిరంగ వేలము వేయబడును. కావున వేలములో పాల్గొనదలచినవారు వచ్చి పాటలో పాల్గొనవచ్చును. పాడుకున్నవారు పాట మొత్తంలో 1/4 వంతు అదేరోజు కోర్టులో డిపాజిట్టు చేయవలెను.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం సబ్ రిజిష్ట్రీ, తాడేపల్లిగూడెం మున్సిపల్ ఏరియా, వార్డు నెంబరు 28, (ప్రస్తుతం 12వ వార్డు) కొబ్బరితోట, ఉత్తరపు పోర్షను ఆర్‌సిసి బిల్డింగు, పూరా చ॥గ॥ 202 లలో డోరు నెంబరు 12-4-18/1, 2 అసెస్‌మెంటు నెంబరు 1080013289, యీక్రింది సరిహద్దుల నడుమ
తూర్పు: కర్రి భాస్కరరావు గారి సరిహద్దు గోడ.
దక్షిణం: నాంద్ర లక్ష్మికి క్రియం చేసిన పోర్షను.
పడమర: ఇసుకపల్లి సీతారామారావు స్థలము.
ఉత్తరం: నంబుల బసవమ్మ మరియు ఇతరుల గోడ.

పై హద్దుల మధ్య చ॥గ॥ 102లలో పూరా చ॥గ॥ 202లో డోరు నెంబరు 12-4-18/1 నెంబరు గల ఆర్‌సిసి బిల్డింగు, తలుపులు, కిటికీలు, కరెంటు సర్వీసు నెంబరు 22213తో సహా.

తాడేపల్లిగూడెం **బి.హెచ్.శేషు**
04-04-23 పిటిషనరు తరపు అడ్వకేటు

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT NUZIVID
E.P. NO. 60/2016 IN ACP NO. 172/2014

Margadarsi Chit Fund (P) Ltd.,
Santosh Nagar Branch, Hyderabad...DHR

And

Mr. T.V.R. Vara Prasad, S/o Krishna Rao, aged 56 years, R/o H.No.1-8-22/1, Flat No. G-2, Sarathi Apartment, North Kamala Nagar, ECIL (P), R.R. District.
(Property Situated at Nuzivid, Eluru Dist.)
... 1st JDR

పై నెంబరు అమలులో 1st JDR తాలూకు ఈ క్రింది తెలిపిన ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది. 24-4-2023వ తేదీన పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 గం.లకు బహిరంగ వేలము జరుగునని తెలియజేయటమైనది. కావున వేలంపాటలో పాల్గొను వారు వేలంపాటలో పాల్గొనవచ్చును.

1st JDR Schedule : Krishna District, Nuzivid Sub Registrar Office వారి యిలాకా నూజివీడు మున్సిపాలిటీ ఏరియాలోని, నూజివీడు మండలం, నూజివీడు గ్రామంలో Agriculture Land Admearuring Ac.0-23, 3/4 Cts or 0.97 Hectors in Survey No.1005/1, Nuzivid ఏరియాలో గల ఖాళీగా వున్న స్థలమునకు హద్దులు.
North : B.Rambabu & E.Rajashekar Land
South : Donka, West : Donka
East : G.Hari Krishna Prasad Land.
Note : (Krishna District, Now present Eluru District)
D.H.R. Value : Rs. 4,00,000/-
Ameena Value Rs. 7,00,000/-
(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వేలం వాయిదా : 24-04-2023
ఫరదర్ హియరింగ్ : 01-05-2023

ఇట్లు
శ్రీ ఎం.రమేష్,
అడ్వకేట్, నూజివీడు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. **24.04.2023** ఉ॥ **10-00** గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు **1470.21** గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798